వైభవంగా ఫలహారం బండ్ల ఊరేగింపు



ఫలహారం బండ్ల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రసూల్‌పురా: ఆషాఢ మాస బోనాల జాతరలో భాగంగా కంటోన్మెంట్‌ నియోజక వర్గంలో ఆదివారం రాత్రి కాంగ్రెస్‌ పార్టీ మాజీ అధ్యక్షులు ప్రమోద్‌కుమార్‌, బీఆర్‌ఎస్‌ యువజన నాయకుడు సాయి కిరణ్‌, జగన్‌, సాయిప్రసాద్‌,సూరజ్‌ ఫ్రెండ్స్‌ ఆధ్వర్యంలో ఫలహార బండ్ల ఊరేగింపు వైభవంగా నిర్వ హించారు. సికింద్రాబాద్‌ ఎమ్మెల్యే టి. పద్మరావు, నటుడు ఆకాష్‌ పూరి తదితరులు పాల్గొన్నారు. బాలంరాయి దండుమారమ్మ ఆలయం ఈవో రవికాంత్‌ ఆధ్వర్యంలో సోమవారం స్వర్ణలత పచ్చికుండపై నిలబడి భవిష్య వాణి వినిపించారు.

ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం

సనత్‌నగర్‌: బేగంపేటలోని కంట్రీ క్లబ్‌లో సోమవారం సాయంత్రం రోటరీ క్లబ్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ మిడ్‌టౌన్‌ 42వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డిస్ట్రిక్ట్‌ గవర్నర్‌ (3150) శరత్‌చౌదరి, ప్రథమ మహిళ సాహితీల సమక్షంలో జరిగిన ఈ వేడుకలకు విశ్రాంత ఐఏఎస్‌ అధికారి డాక్టర్‌ డప్నె మార్గరెట్‌ దే రెబెల్లో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. క్లబ్‌ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. క్లబ్‌ మెంటర్‌ విజయలక్ష్మీ షెకావత్‌, చార్టర్‌ మెంబర్‌ పీఎస్‌ఎన్‌ ప్రసాద్‌ పాల్గొన్నారు.

రేపు ఓయూలో గద్దర్‌ వర్ధంతి సభ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బుధవారం దివంగత ప్రజా గాయకుడు గద్దర్‌, జర్నలిస్టు జహీర్‌ అలీఖాన్‌ ప్రథమ వర్ధంతి సభ జరగనుంది. దళిత, బహుజన, వామపక్ష, తెలంగాణ విద్యార్థి సంఘాలతో పాటు ఓయూ విద్యార్థుల నేతృత్వంలో మధ్యాహ్నం ఆర్ట్స్‌ కాలేజీలోని 57వ తరగతి గదిలో సభను నిర్వహించనున్నట్లు ఆహ్వానితులు పీహెచ్‌డీ స్కాలర్‌ కంచర్ల బద్రీ తెలిపారు. 17 విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగే వర్ధంతి సభకు పీహెచ్‌డీ స్కాలర్స్‌ సునీల్‌ శెట్టి, సలీం పాషాలు అధ్యక్షత వహిస్తారన్నారు. అరుణోదయ విమలక్క, సిని దర్శకులు నర్సింగరావు, విశ్రాంత ప్రొఫెసర్లు హరగోపాల్‌, కంచ ఐలయ్య, కోదండ రామ్‌, అన్సారీ, ప్రొ.కాశీం, సియాసత్‌ ఎడిటర్‌ అమీర్‌ అలీఖాన్‌, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, గద్దర్‌ కూతురు వెన్నెలతో పాటు ఓయూ పూర్వవిద్యార్థి నేతలు హాజరుకానున్నట్లు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ సోమవారం పూజలు

సనత్‌నగర్‌: శ్రావణమాసం ప్రారంభం సందర్భంగా ఆలయాల్లో భక్తుల కోలాహలం మొదలైంది. శ్రావణ సోమవారం సందర్భంగా ముక్కంటి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సనత్‌నగర్‌ హనుమాన్‌ దేవస్థానం ప్రాంగణంలోని మల్లికార్జునస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహిచారు. భక్తులు భక్తి శ్రద్ధలతో అభిషేక మహోత్సవంలో పాల్గొని తరించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. శ్రీకాంత్‌రెడ్డి, రాజన్న తదితరులు అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య

అడ్డగుట్ట: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య సూచించారు. 'డ్రగ్స్‌ ను నిర్మూలిద్దాం-సమాజాన్ని మేలుకొలుపుదాం' అనే అంశంపై ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో తుకారాంగేట్‌లోని షిరిడీ సాయిబాబా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ.. కొందరు యువత ప్రస్తుతం డ్రగ్స్‌, మత్తు పదార్థాల మత్తులో ఊగిసలాడుతూ జీవితాన్ని నిర్వీర్యం చేసుకుంటున్నారన్నారు.

యుద్ధప్రాతిపదికన సమస్యల పరిష్కారం

రసూల్‌పురా: ఓల్డ్‌ మడ్‌ఫోర్ట్‌ బస్తీలో నెలకొని ఉన్న సమస్యలు యుద్ధప్రాతిపదికన పరిష్కరించనున్నట్లు కంటోన్మెంట్‌ బోర్డు నామినేటెడ్‌ సభ్యులు జే. రామకృష్ణ హామిచ్చారు. సోమవారం బోర్డు మూడవ వార్డు పరిధిలోని ఓల్డ్‌ మడ్‌ఫోర్ట్‌ బస్తీలో రామకృష్ణ బస్తీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్‌బోర్‌వెల్‌ పైపులైను అభివృద్ధి, రోడ్ల గుంతల సమస్యలు, రోడ్డు అభివృద్ధి తదితర సమస్యలు పరిష్కరించాలని రామకృష్ణకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బిఎస్‌. శ్రీనివాస్‌, సురేష్‌, అరుణ్‌, రాజ మల్లేష్‌, శంకర్‌, తదితరులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం హుండీలను అధికారులు లెక్కించారు. హుండీల ద్వారా ఆలయానికి మొత్తం రూ.85.14 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆర్యనగర్‌లో తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల ప్రాముఖ్యతను తెలిపే పోస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం.

లాలాపేట: తార్నాక మున్సిపల్‌ డివిజన్‌ ఆర్యనగర్‌ కమ్యూనిటీ హాల్లో స్థానిక పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్‌ అధికారులు, తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్‌ఐఎన్‌)శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల పాముఖ్యతను తెలియజేసే పోస్టర్లను ప్రదర్శించారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

గాంధీఆస్పత్రి : తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పలువురు వైద్యనిపుణులు సూచించారు. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో సోమవారం అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవ వేడుకలు, చైతన్యర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీ ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ ఇందిరా, సూపరింటెండెంట్‌ ప్రొఫెసర్‌ రాజకుమారి, ఐఏపీటీసీబీ జనరల్‌ సెక్రటరీ డాక్టర్‌ ఎస్‌ఎల్‌ శ్రీధర్‌లు మాట్లాడుతూ పుట్టిన శిశువుకు కనీసం ఆరునెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు.



ఏర్పాటు చేసిన రోజుల్లో తబలాలు, వీణ (ఫైల్‌)



తబలాలు, వీణ దుస్థితి

సుందరీకరణపై అశ్రద్ధ

మసకబారిన బ్యూటిఫికేషన్‌

- వాయిద్య పరికరాల ప్రతిమల నిర్వహణపై అధికారుల నిర్లక్ష్యం



సర్వంగ సుందరంగా హార్మోనియం, వాయిద్య పరికరాలు (ఫైల్‌)



హార్మోనియం, వాయిద్య పరికరాల ప్రస్తుత స్థితి

సికింద్రాబాద్‌: బ్యూటిఫికేషన్‌ ఆఫ్‌ హైదరాబాద్‌ పేరిట జీహెచ్‌ఎంసీ అధికారులు చేపడుతున్న అభివృద్ధి పనులు మూనాళ్ళ ముచ్చట గానే మిగిలిపోతున్నాయి. సికింద్రాబాద్‌ ప్రాంత ప్రధాన రహదారుల్లో ప్రయాణికులకు కనువిందు చేయడానికి అధికారులు రూ.కోట్లు వెచ్చించి చేపడుతున్న సుందరీకరణ పనులు నిర్వహణ లేమి కారణంగా క్రమేణా కాల గర్భంలో కలుస్తున్నాయి. ఆధునీకరణ పేరుతో సికింద్రాబాద్‌ ప్రధాన రహదారుల వెంట ఏర్పాటు చేసిన బయోటాయిలెట్లు, వాటర్‌ ఫౌంటెయిన్లు ఎప్పుడో కనుమరుగయ్యాయి. అధికారులు మారినపుడల్లా కొత్త ప్రతిపాదనలు రూపొందించి అమలు చేస్తుండడం, పాత పనులను సమీక్షించక పోతుండడం కారణంతోనే ఇటువంటి దుస్థితి నెలకొంటుందన్న అభిప్రాయం సికింద్రాబాద్‌ ప్రజల్లో వ్యక్తం అవుతుంది.

కనువిందు కనుమరుగు

సంగీత్‌ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సంగీత వాయిద్య పరికరాల ప్రతిమలు కూడా క్రమేణా అదే జాబితాలో చేరుతున్నాయి. నాలుగేళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటు చేసిన వాయిద్య పరికరాల ప్రతిమలు ప్రయాణికులను ఎంతో కనువిందు చేసేవి. అందమైన రంగులతో వాస్తవ వాయిద్య పరికరాలను తలపించే తరహాలో రూపొందించిన వీణలు, హార్మోనియం, తబలాలు సందర్శకులకు ముచ్చట గొలిపేవి. ఏర్పాటు చేసిన కొత్తలో ఎప్పటి కప్పుడు వాయిద్య పరికరాలను శుభ్రం చేయడం, రంగులు అద్దడం వంటి చర్యలు తీసుకున్న అధికారులు ఆ తరువాత వదిలేశారు. తొలి రోజుల్లో పరికరాల చుట్టూ ఏర్పాటు చేసిన కంచె కూడా ఆనవాళ్లు లేకుండా పోయింది. కూడలిలో అదుపు తప్పుతున్న వాహనాలు ఢీ కొడుతుండడంతో వారిద్య పరికరాల ప్రతిమలు ధ్వంసం అవుతున్నాయి.

పేరు సార్థకత కోసం

రైల్వే స్టేషన్‌ సమీపంలోని క్లాక్‌టవర్‌ నుంచి రైల్‌నిలయం వెళ్లే మార్గంలోని కూడలిలో దశాబ్దాల కాలంగా సినిమా థియేటర్‌ ఉండేది. థియేటర్‌ పేరు సంగీత్‌ కావడంతో కూడలికి కూడా సంగీత్‌ చౌరస్తాగా పేరు వచ్చింది. మారుతున్న ఆధునికత నేపథ్యంలో ఇక్కడి సంగీత్‌ థియేటర్‌ ను యాజమాన్యం నేలమట్టం చేసి మల్టీప్లెక్స్‌ నిర్మాణం చేపట్టింది. సినిమా థియేటర్‌ నేలమట్టం చేసినందున సంగీత్‌ కూడలికి సార్థకత చేకూర్చడం కోసం ఇక్కడ సంగీత వాయిద్య పరికరాలను ఏర్పాటు చేశారు. అధికారులు తీసుకున్న నిర్ణయానికి అప్పట్లో ప్రయాణికులు, వాహనదారుల నుంచి ప్రశంసల జల్లు కురిసింది. ప్రశంసలు కురిపించిన వారే నేటి అధికారుల నిర్లక్ష్యానికి విచారం వ్యక్తం చేస్తున్నారు.

తిరిగి సుందరీకరించాలి..

సంగీత్‌ కూడలికి నిండుదనం తేవడానికి ఏర్పాటు చేసిన వాయిద్య పరికరాలను తిరిగి సుందరీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రహదారి విస్తరణ చేయడంతో వాయిద్య పరికరాల చుట్టూ ఏర్పాటు చేసిన కంచెను తొలగించారు. అదీ కాకుండా రోడ్డు ఎత్తు పెరుగడంతో వాయిద్య పరికరాలు ఏర్పాటు చేసిన దిమ్మె ఎత్తు తగ్గిపోయి రోడ్డు సమాంతరంగా మారింది. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి సంగీత్‌ కూడలి లో ఏర్పాటు చేసిన వాయిద్య పరికరాలకు పూర్వ వైభవం చేకూర్చాలని కోరుతున్నారు.

పాఠశాలకు రహదారి సౌకర్యం కల్పించండి

- ప్రజావాణిలో ఫిర్యాదు



ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్‌ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ నాయకులు, పాఠశాల తల్లుల సంఘం ప్రతినిధులు మరోమారు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు రహదారి సౌకర్యం లేకపోవడంపై స్కూలుకు దారేది? శీర్షికతో సాక్షి ఇటీవల కథనం ప్రచురించింది. సోమవారం జరిగిన ప్రజావాణిలో 'సాక్షి' ప్రచురించిన పేపర్‌ క్లిప్పింగ్‌లతో మరోమారు ఫిర్యాదు చేశారు. సీపీఐ సికింద్రాబాద్‌ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్‌ కొమురెల్లి బాబు పాల్గొన్నారు.

జీవితబీమా కుటుంబానికి ఆసరా



జీవిత బీమా చెక్కును అందిస్తున్న సుబ్రహ్మణ్యం

రాంగోపాల్‌పేట్‌: పోస్టల్‌ జీవిత బీమా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుందని సికింద్రాబాద్‌ డివిజనల్‌ సీనియర్‌ పోస్టల్‌ సూపరింటెండెంట్‌ సుబ్రహ్మణ్యం అన్నారు. కేవీవీ సత్యనారాయణ అనే వ్యక్తి రూ.1541తో జీవిత బీమా తీసుకుని మే నెలలో గుండె పోటుతో మరణించాడు. ఆయన కుటుంబానికి వచ్చిన రూ. 5లక్షల జీవితా బీమా సొమ్ము చెక్కును ఆయన సోమవారం సికింద్రాబాద్‌ పోస్టాఫీస్‌లో అందించారు. కార్యక్రమంలో పోస్టల్‌ అధికారులు పద్మ, బారువా, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగస్వామ్యం కావాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్‌ శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని డిప్యూటీ మేయర్‌ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం తార్నాక నాగార్జుననగర్‌ పార్క్‌లో స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మోతే శోభన్‌ రెడ్డి, జోనల్‌ కమీషనర్‌ రవికిరణ్‌, డిప్యూటీ కమీషనర్‌ సుభాష్‌, నాగార్జున నగర్‌ వాసులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు

బన్సీలాల్‌పేట్‌: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ వెంకట్‌ అన్నారు. సోమవారం బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ చాచానెహ్రూనగర్‌లోని బస్తీ దవఖానాను సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ వెంకట్‌ మాట్లాడుతూ బస్తీలు, మురికివాడల్లోని పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం బస్తీ దవఖానాలు ఎంతో దొహదపడుతున్నాయని చెప్పారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్య సేవలు, మందులు, వైద్య పరీక్షలు వంటి అనేక వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఎస్పీహెచ్‌ఓ డాక్టర్‌ జయశ్రీ, డాక్టర్‌ రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమంలో డాక్టర్‌ వెంకట్‌ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

అమీర్‌పేట: అద్దె అడిగేందుకు వెళ్లగా జరిగిన గొడవలో కింద పడ్డ ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఆర్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన మేరకు.. ధరం కరం రోడ్డులో ఉండే వెంకటేశ్వర్‌రావు (65) సోదరుడికి నేచర్‌ క్యూర్‌ ఆసుపత్రి సమీపంలో రెండు ఫ్లాట్స్‌ ఉన్నాయి. ఒక ఫ్లాట్‌లో అద్దెకు ఉన్న న్యాయవాది నీలకంఠేశ్వర్‌రావు కొన్ని నెలల నుంచి అద్దె ఇవ్వడం లేదు.దీంతో వెంకటేశ్వరావు, మరో ముగ్గురు సోదరులు కలిసి నీలకంఠేశ్వర్‌రావు వద్దకు వెళ్లి అద్దె అడిగారు. దీంతో మాటా మాట పెరిగి గొడవకు దారి తీసింది. మాట్లాడుతుండగా వెంకటేశ్వర్‌రావు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రైలు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: పట్టాలు దాటే ప్రయత్నం చేసి రైలు ఢీ కొట్టిన ప్రమాదంలో గాయపడ్డ ఓ వృద్ధుడు సోమవారం మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం... మల్కాజిగిరికి చెందిన సాధుజైరాం చెట్టి (82) ఆదివారం సాయంత్రం సఫిల్‌గూడ రైల్వేస్టేషన్‌ ప్రాంతంలో పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ సాధుజైరాం చెట్టిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించారు. కొద్దిగంటల పాటు చికిత్స పొందిన బాధితుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

ఆర్వో ప్లాంట్‌ అందజేసిన పూర్వ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌ న్యాయకళాశాల 1986–89 బ్యాచ్‌ విద్యార్థులు గౌతమి (ఈ–1) హాస్టల్‌ విద్యార్థుల కోసం ఆర్వో ప్లాంట్‌ను అందజేశారు. సోమవారం హాస్టల్‌లో ఆర్వో వాటర్‌ ప్లాంట్‌ను పూర్వ విద్యార్థులు ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీధర్‌ శర్మ, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ స్పష్టం చేశారు. వెస్ట్‌ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని 80 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.28.86 లక్షల విలువైన చెక్కులను సోమవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అదేవిధంగా బాలానగర్‌ మండల పరిధిలోని సనత్‌నగర్‌ డివిజన్‌కు చెందిన 30 మందికి షాదీముబారక్‌, కళ్యాణలక్ష్మీ చెక్కులను కూడా లబ్దిదారులకు అందజేశారు.

యువత క్రీడలపై దృష్టి సారించాలి

అమీర్‌పేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. అమీర్‌పేట మున్సిపల్‌ గ్రౌండ్‌లో తలసాని శంకర్‌యాదవ్‌ స్మారక క్రికెట్‌ పోటీలను సోమవారం ప్రారంభించారు. తన సోదరుడు, మోండా మార్కెట్‌ అధ్యక్షులు తలసాని శంకర్‌యాదవ్‌ జ్ఞాపకార్థం క్రికెట్‌ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అమీర్‌పేట మాజీ కార్పొరేటర్‌ నామన శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛదనం..పచ్చదనం



సనత్‌నగర్‌: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సోమవారం శ్రీకారం చుట్టారు. సికింద్రాబాద్‌, సనత్‌నగర్‌, కంటోన్మెంట్‌ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ నెల 9వ తేదీ వరకు ఐదు రోజుల పాటు కొనసాగే ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా బస్తీలు, కాలనీల్లో ఒకవైపు 'స్వచ్ఛత', మరోవైపు పచ్చదనం పెంపొందించేలా ప్రణాళికలు రూపొందించారు. సర్కిల్‌కు నాలుగు వాహనాలతో పాటు జేసీబీని కేటాయించి ఎక్కడ చెత్తా చెదారం, వ్యర్థాలు కనిపించినా తరలించి పరిశుభ్రంగా తీర్చిదిద్దనున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్లు కూడా పాలుపంచుకోనున్నారు.







సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379